క్లుప్తంగా

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

సుజాతనగర్: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సుజాతనగర్ మండలంలో గురువారం పర్యటించనున్నారు. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేస్తారని ఆ పార్టీ శ్రేణులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఇల్లెందు: ప్రభుత్వం పద్మశాలీల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయటం పట్ల పట్టణ పద్మశాలీ సంఘం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం ఇల్లెందులో పట్టణ పద్మశాలీ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు నేతలు పాల్గొని ప్రభుత్వం నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న పద్మశాలీల జీవనం మెరుగు పడుతుందని, ఉపాధి, రుణాలు లభిస్తాయని ఆ సంఘం జిల్లా నాయకులు గోచికొండ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహేశ్వర్, రాజు, రమేష్, నర్సింహారావు, సంజీవరావు, నాగరాజు, రమాకాంత్, రమేష్, సతీష్, వెంకటరాజు, రాహుల్, రాజేష్, ఈశ్వర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.పద్మ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డ రవికుమార్ మాట్లాడారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనా కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యాశాఖ సూపరింటెండెంట్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీ సుల్తానా, రామలక్ష్మి, వెంకటనర్సమ్మ, ఈశ్వరమ్మ, రాణి, నజీమా, అరుణ, అనసూర్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సింగరేణి(కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నలందా కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పదో తరగతి ప్రతిభా పరీక్షలో (టాలెంట్ టెస్ట్)లో సెయింట్ జోసఫ్ హైస్కూల్ విద్యార్థులు బహుమతులు సాధించారు. ఎం.సాయిఅవినాష్ తృతీయ బహుమతి, విక్రాంత్ బాబు, రిహాన్, భూమిక కన్సోలేషన్ బహుమతులు సాధించారు. వారిని ప్రిన్సిపాల్ బుధవారం పాఠశాలలో అభినందించారు.

ఇంటర్ ప్రాజెక్ట్ క్రీడా పోటీల్లో..



సీఈని సన్మానిస్తున్న అధికారులు, క్రీడాకారులు

పాల్వంచ: ఈనెల 7వ తేదీ నుంచి 11వరకు భూపాలపల్లి కేటీపీపీలో జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ ప్రాజెక్ట్స్ షటిల్, క్రికెట్ క్రీడా పోటీల్లో కేటీపీఎస్ 7వ దశ క్రీడాకారులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సీఈ కార్యాలయంలో సీఈ పి.వెంకటేశ్వరరావు క్రీడాకారులను అభినందించారు. అనంతరం సీఈ వెంకటేశ్వరరావు, గేమ్స్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లును సన్మానించారు. అనంతరం సీఈ మాట్లాడుతూ.. క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎస్.యుగపతి, డీఈ ఎస్ఎన్ఎస్.శేఖర్, ఆరిఫ్, పీఈ శ్రీనివాస్, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డును మరిచిపోయారా?

- కరివారిగూడెం రహదారి అధ్వానం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కొమ్ముగూడెం - కరివారిగూడెం మధ్య దెబ్బతిన్న బీటీ రోడ్డు

జూలూరుపాడు: మండలంలోని కొమ్ముగూడెం–చీపురుగూడెం క్రాస్ రోడ్ వరకు బీటీ రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. 15 ఏళ్ల క్రితం కొమ్ముగూడెం నుంచి కరివారిగూడెం వరకు నిర్మించిన బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. రహదారి నిర్మించిన నాటి నుంచి ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. కరివారిగూడెం, కరివారిగూడెం కాలనీ, బాడవప్రోలు, కొమ్ముగూడెం గ్రామాల ప్రజలతోపాటు, భేతాళపాడు, చింతలతండా గ్రామ పంచాయతీలను కలిపే లింకు రోడ్డు కావడంతో ఆయా గ్రామాల వారికి కూడా ఇబ్బందిగా ఉంది.

ఈ రహదారిపై రాత్రివేళల్లో బైక్, ఆటో, ట్రాలీ, కారు నడపడం కష్టంగా మారింది. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలు జరుగుతున్నాయి. అడుగడుగునా గుంతలు ఉండటంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రోడ్డుపై బైక్, ఆటో, కారు, ట్రాలీ, కారు, స్కూల్ బస్సులు, వ్యాన్‌లు, లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ ప్రమాదం ఎప్పుడు ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చొరవ చూపి రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతల మయంగా ఉన్న రహదారి

మరమ్మతులు చేపట్టాలి



కొమ్ముగూడెం నుంచి కరివారిగూడెం మధ్య గల బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. రోడ్డంతా గుంతల మయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఏళ్ల క్రితం నిర్మించిన రహదారికి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో బైక్‌పై ప్రయాణించాలంటేనే భయంగా ఉంది.

– తోట శ్రీనివాసరావు, కరివారిగూడెం

రోడ్డంతా అస్తవ్యస్తం



రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఏళ్లుగా ఇలాంటి పరిస్థితి ఉండటంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

– సునావత్ కిషన్, కొమ్ముగూడెం

ప్రతిపాదనలు పంపించాం..



కొమ్ముగూడెం నుంచి వయా కరివారిగూడెం మీదుగా చీపురుగూడెం క్రాస్ రోడ్ వరకు ఉన్న బీటీ రోడ్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. పైఅధికారులు రోడ్డును పరిశీలించి మరమ్మతులకు మంజూరు ఇస్తారు. నిధుల మంజూరు రాగానే ఆలస్యం చేయకుండా వెంటనే పనులు చేపడతాం.

– నాగేందర్, పీఆర్ ఏఈ, జూలూరుపాడు

గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

టేకులపల్లి: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఓబీసీ, ఎస్సీ, బీసీ, ఎస్టీల కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గౌడ కులస్తులను విస్మరించిందని బీఆర్ఎస్ టేకులపల్లి మండల అధ్యక్షుడు బొమ్మెర వరప్రసాద్ గౌడ్ విమర్శించారు. యాదవ (కుర్మ), మున్నూరు కాపు, పద్మశాలి, పెరిక (పురగిరి క్షత్రియ), లింగాయత్, బలిజ, గంగపుత్ర, మేరా, ముదిరాజ్ కార్పొరేషన్లు, ఆర్యవైశ్య, రెడ్డి, మాదిగ, ఉపకులాలు, మాల, ఉపకులాలకు కార్పొరేషన్లు, కుమురం భీమ్ ఆదివాసీ, సంత్‌సేవాలాల్ లంబాడీ, ఎరుకలు, ఇతర ఉపకులాల కోసం ఏకలవ్య కార్పొరేషన్ మొత్తం 16 కార్పొరేషన్లు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డికి గౌడ కులస్తులు కనిపించ లేదా అని ప్రశ్నించారు. సమాజంలో ప్రత్యేక స్థానం కలిగిన గౌడలను చిన్నచూపు చూడటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



కొత్తగూడెంరూరల్: పరీక్ష కిట్లు అందుకున్న వారితో డీఎస్పీ, ఉపాధ్యాయులు

కొత్తగూడెంరూరల్: పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేయటం శుభపరిణామమని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఫౌండేషన్ కొత్తగూడెం ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష కిట్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహను అలవర్చుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కొత్తగూడెం వ్యవస్థాపకుడు సీహెచ్ శ్రీకాంత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మోరుగు చింటేశ్వర్, ఉదయ్, కౌశిక్, శ్యామ్, జయంత్, సాయి తదితరులు ఉన్నారు.

పాల్వంచరూరల్: యానంబైల్ హైస్కూల్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ ఆధ్వర్యంలో కంపాక్స్ బాక్స్‌లు, పెన్నులను వితరణగా అందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్‌పర్సన్ కె.నవీన్, క్లబ్ కోశాధికారి... క్లబ్ కోకన్వీనర్ ఆరుద్ర సత్యనారాయణ, అధ్యక్షులు చేపూరి బ్రహ్మచారి, హెచ్ఎం ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

బీసీ లైజన్ ఆఫీసర్‌ను నియమించండి

ఇల్లెందు: సింగరేణి సీఎండీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించిన నేపథ్యంలో తక్షణమే బీసీ లైజన్ ఆఫీసర్‌ను నియమించాలని ఇల్లెందు ఏరియా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. బుధవారం బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జీఎం జాన్‌ఆనంద్‌ను కలిసి విన్నవించింది. నిర్ణీత లక్ష్యం సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జీఎంను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పూర్ణచందర్‌రావు, కోట సాంబయ్య, రాజు, యాదగిరి, గిరిధర్‌రావు, జీవీ మోహన్‌రావు, మహేష్, రవి, రంగనాథ్, శ్రీనివాస్, సతీష్, వేణుమాధవ్, వెంకటేశ్వరరావు, సత్యం, నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



జీఎంను సత్కరిస్తున్న నాయకులు

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జూలూరుపాడు: మండల కేంద్రంలోని డాక్టర్ అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం స్థానిక సీఐ ఇంద్రసేనారెడ్డి పర్యవేక్షణలో సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ మాట్లాడుతూ... సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు జరిగినా వెంటనే 1930 సైబర్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని లేదా 100కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుళ్లు వెంకట్, సురేష్, కుటుంబరావు, ఆటో డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం..



మాట్లాడుతున్న వంశీ

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్ డిపోలో అన్ని సమస్యలే దర్శనం అవుతున్నాయి. గడిచిన ఎన్నికలకు ముందు కనీస సదుపాయాలు కల్పించకుండా ఆఘమేఘాల మీద శాటిలైట్ బస్ డిపోను ప్రారంభించారు. కానీ నిర్మాణంలోనే ఏళ్ల కాలం పట్టినా ఎలాంటి సదుపాయాలు కల్పించకుండా ఏర్పాటు చేశారు. కనీసం 100 మంది ఉద్యోగులు ఉండేందుకు తగిన సదుపాయాలు లేకుండా ఏర్పాటు చేయటం పట్ల ఇక్కడి ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్యకు టీడీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం అందజేసిన వినతిపత్రంలో మంచినీరు, సీసీ కెమెరాలు, డైనింగ్ హాల్, రెస్ట్ రూం, బస్టాండ్‌లోకి అవుట్ ఇన్ బోర్డులు, బస్టాండ్‌లో హోటల్ అందుబాటులోకి తీసుకుని రావాలని కోరారు.

విద్యార్థులు ఆందోళన చెందొద్దు..





హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరచారి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులను సరైన మార్గంలో నడిపించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టి బాధ్యత వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి సూచించారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులలో పరీక్షల ఒత్తిడిని అధిగమించేందుకు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మాట్లాడారు. పిల్లలు పరీక్షలను ఒత్తిడితో కాకుండా ఇష్టంతో రాయాలని, పరీక్ష ఫలితాలే జీవితం కాదని ఎంతో జీవితం ముందుందని, దీన్ని గుర్తించి పిల్లలని వారివారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరీక్షాపే చర్చ కార్యక్రమం, అలాగే పిల్లలపై వచ్చిన ఒత్తిడిని తగ్గించడానికి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన చర్యలను సబ్జెక్టు నిపుణులు అకాడమిక్ మోనిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పిల్లలు పరీక్షలను పండుగ వాతావరణంలో రాయాలని, పరీక్షలు కేవలం ప్రస్తుత పఠనాశక్తిని మాత్రమే పరీక్షిస్తాయని జీవితాన్ని కాదని, చిరునవ్వుతో పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించి అదే చిరునవ్వుతో ప్రశ్నలకు జవాబులు రాసి చిరునవ్వుతో బయటకు రావాలని, పిల్లలు పరీక్షలను ఆందోళనతో కాకుండా యోధులుగా ఎదుర్కోవాలని, వారి లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి సరైన మార్గాన్ని ఎంచుకోవాలని వివరించారు. అనంతరం సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తక రచయిత ఉండేటి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ... పిల్లలకు మంచి, చెడుల విచక్షణ జ్ఞానాన్ని తెలుసుకునే సామర్థ్యాలు అందించాలని, అలాగే పిల్లల హక్కులు కాలరాసే అధికారం ఎవరికీ లేదని, యుక్త వయస్సు పిల్లల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్నేహపూర్వక వాతావరణంలో వ్యవహరించి వారి సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎస్.సతీష్‌కుమార్, బాలికా విద్య కోఆర్డినేటర్ జె.అన్నామణి, వివిధ పాఠశాలల నుంచి 300 మంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజావసరాల మేరకు అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెంఅర్బన్: ప్రజా అవసరాలకు అనుగుణంగా కొత్తగూడెం మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో రూ.4.95కోట్ల డీఎంఎఫ్, 14వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, బస్‌షెల్టర్, పార్క్, టెన్నిస్‌కోర్ట్, కల్వర్టులకు బుధవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ... జిల్లా కేంద్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసుకునే లక్ష్యంతో దశలవారీగా నిధులు మంజూరు చేయించుకొని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. త్వరలో మిగిలిన పనులకు నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు శాశ్వత పరిష్కారమార్గాన్ని అన్వేషిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. అర్హులైన పేదలకు పాతకొత్తగూడెంలో ఇంటి స్థలాలు కేటాయించడం జరిగిందని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. జిల్లా కేంద్రం ఆదర్శంగా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించి అన్నివిధాలా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. వార్డు కౌన్సిలర్లు వారి ప్రాంత సమస్యలను తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, తహసీల్దార్ పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ శేషంజన్‌స్వామి, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, అనిల్, నలిగంటి శ్రీనివాస్, ఫహీం, జహీర్, అజీజ్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు వివిధ వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న సీడీపీఓ తార

టేకులపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలన్నీ విధిగా నిర్వహించాలని టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి ప్రాజెక్టు కార్యాలయంలో గుండాల, ఆళ్లపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్ల ప్రాజెక్టు మీటింగ్ జరిగింది. మాన్యువల్ సర్వే యాప్ మరియు పోషణ పక్వాడాలో భాగంగా చేయవలసిన కార్యక్రమాల గురించి వివరించారు. పిల్లల గ్రోత్ మార్టిన్ గురించి తెలియజేశారు. సీడీపీఓ మాట్లాడుతూ... అంగన్‌వాడీ టీచర్లందరూ అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని, మెనూ ప్రకారం తల్లీబిడ్డలకు పోషకాహారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ అరుణకుమారి, ఆళ్లపల్లి, గుండాల మండలం సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కోడ్ రాక ముందే పీఆర్సీ ఇవ్వండి..



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

చుంచుపల్లి/కొత్తగూడెంఅర్బన్: మంత్రి మండలి సమావేశంలో డీఏ, పీఆర్‌సీ, సీపీఎస్, జీఓ 317లపై ముఖ్యమంత్రి చర్చిస్తామని ప్రకటించిన్నప్పటికీ వాటి ప్రస్తావన లేకపోవడం పట్ల కేబినెట్ మీటింగ్ నిరాశ నిస్పృహలకు గురిచేసిందని, ముఖ్యమంత్రి పునరాలోచన చేసి డీఏ, పీఆర్‌సీలపై వెంటనే ప్రకటన చేయాలని, పార్లమెంటు ఎన్నికల కోడ్ కంటే ముందే ప్రకటించాలని పీఆర్‌టీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటేశ్వరరావు, బి.రవి డిమాండ్ చేశారు. బుధవారం పెనగడపలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 317 జీఓపై సలహా అవకాశాన్ని కల్పించడాన్ని స్వాగతిస్తూనే, నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉంచడం బాధాకరమని, ఎన్నో ఆశలతో తెచ్చుకున్న ఈ ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులను విస్మరించడం సరికాదని ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఆలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రంజాన్‌మియా, మధుసూదన్‌రావు, హరిప్రసాద్, సరస్వతి, సూర్యకాంతం, రాము తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందురూరల్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని పోలారం గ్రామంలో బుధవారం హమాలీ కార్మికుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ... నిత్యం బరువులు మోస్తూ హమాలీ కార్మికులు అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వాపోయారు. 50 సంవత్సరాల వయస్సు పైబడిన హమాలీలకు నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని, చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కోరారు. సమావేశంలో పందిర్లపల్లి వీరన్న, జటంగి వెంకన్న, కిన్నెర పగడయ్య, బొర్ర భిక్షం, నరేష్, బానోత్ కిషన్, శ్రీను, కృష్ణ, మోహిలాల్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే ఆత్మరక్షణకు తోడ్పడుతుంది..



కరాటే శిక్షణను ప్రారంభిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లి పంచాయతీలోని కొమురం భీం భవనంలో బుధవారం రాత్రి కరాటే, చేతిరాత శిక్షణ కార్యక్రమాన్ని సామాజిక సేవా కార్యకర్త ఆరెం ప్రశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితిల్లో చిన్నారులు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సోయం సత్యనారాయణ, కస్తూర్బా గాంధీ స్కూల్ ప్రత్యేకాధికారి తులసి, కరాటే మాస్టార్ కొమరం జనార్ధన్, శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, సురేష్, రాందాసు, బాలు పాల్గొన్నారు.

‘పది’లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం..



కాకర్ల హైస్కూల్‌లో విద్యార్థులతో హెచ్ఎం సంజీవరావు, ఉపాధ్యాయ బృందం

జూలూరుపాడు: గత ఏడాది కంటే, ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవరావు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు (ఫేర్‌వెల్ డే) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో వార్షిక పరీక్షలు రాసి, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోను కాకుండా మనోధైర్యంతో పరీక్షలు రాసి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ప్రణాళికా బద్ధంగా పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని, దీనికి ఉపాధ్యాయుల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, బి.సంపత్, ఖాజామియా, శంకర్, కె.శ్రీనివాసరావు, నయీమ్, సత్యం, రాణి, మిర్యాల రమేష్, పీఈటీ లక్ష్మయ్య పాల్గొన్నారు.